ఉష్ణోగ్రత శనివారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 24.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 26 అక్టోబరు 2025



రోగుల బంధువులు తీసుకువచ్చిన శాంపిళ్లు

పెద్ద పరీక్ష..!

పెద్దాస్పత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలంటే హడల్

- వార్డులకు వెళ్లి శాంపిళ్లు తీయని సిబ్బంది
- రోగుల బంధువులే విభాగాలకు తీసుకెళ్లాలి
- ఏ విభాగం ఎక్కడ ఉందో తెలియక అవస్థలు
- పర్యవేక్షణ గాలికొదిలిన విభాగాధిపతులు
- ఇబ్బందుల్లో రోగులు, వారి బంధువులు



● గుమ్మఘట్ట మండల భూపసముద్రం గ్రామానికి చెందిన వ్యవసాయకూలీ గొల్ల గోవిందప్ప దగ్గు, కడుపునొప్పితో బాధపడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షించిన జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు గోవిందప్పను గురువారం అడ్మిట్ చేసుకున్నారు. వ్యాధి నిర్ధారణ కోసం పది రకాల వైద్య పరీక్షలు రాశారు. పేథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, టీబీ విభాగాల్లో సంబంధిత పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా విభాగల సిబ్బందే వార్డుకు వచ్చి శాంపిళ్లు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించాలి. అయితే వైరల్ సీరాలజీ, హెచ్ఐవీ, సీబీనాట్, కల్చర్, గ్రామ్‌స్టైన్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించే విభాగం సిబ్బంది శాంపిళ్లను తీసుకెళ్లలేదు. దీంతో వార్డులోని సిబ్బంది గోవిందప్ప నుంచి మూడు సిరంజ్‌లలో రక్తాన్ని తీసి ఆయన భార్య నాగమ్మ చేతిలో పెట్టారు. రెండు చిన్న డబ్బాలిచ్చి వాటిలో గళ్లపట్టి తీసుకెళ్లాని సూచించారు. వాటికి సంబంధించిన రిక్విజేషన్స్, కేస్‌షీట్‌ను నాగమ్మ చేతిలోపెట్టి పంపారు. చదువు రాని అమాయకురాలైన ఆమె ఎక్కడికెళ్లాలో, ఎవరిని అడగాలో తెలియక, ఒక్కొక్కరిని అడుగుతూ ఆస్పత్రంతా తిరిగింది. చివరికి మైక్రోబయాజీ విభాగానికెళ్లి రిక్విజేషన్స్, కేస్‌షీట్‌ను చూపించడంతో వివరాలు నమోదుచేసుకుని ఒక సిరంజిలోని రక్తాన్ని తీసుకొని పంపారు. నాగమ్మ అక్కడి నుంచి టీబీ గళ్ల పరీక్షల విభాగానికెళ్లి రిక్విజేషన్, కేస్‌షీట్‌ను చూపించింది. ఒక గళ్ల డబ్బాను తీసుకుని మైక్రోబయాలజీకి వెళ్లాలని సూచించారు. తిరిగి మైక్రోబయాలజీ విభాగానికి వచ్చి గళ్ల డబ్బాను ఇవ్వబోయింది. అయితే గళ్లడబ్బా టీబీ పరీక్షల విభాగంలో ఇవ్వాలని సూచించారు. ఇప్పుడే అక్కడి నుంచి వచ్చాను, ఇక్కడే ఇమ్మన్నారని నాగమ్మ వాపోయినా సిబ్బంది మాత్రం అదేమాటే. రిక్విజేషన్‌లో డాక్టర్ రాసిన స్పూటమ్ కల్చర్‌ను చూడకుండానే నాగమ్మను ముప్పుతిప్పలు పెట్టారు. ఇది ముగిసింది అనుకుంటే హెచ్ఐవీ పరీక్షల కోసం ఆస్పత్రిలోని వెనుక భాగంలోని సత్రంలోకి వెళ్లాలని సూచించారు. చివరికి వార్డులో తీసిచ్చిన మూడు సిరంజ్‌లలో రెండింటిని మాత్రం తీసుకుని ఒకటి వెనక్కి పంపారు. ఇదేంటని అడిగితే వార్డులోనే ఇమ్మన్నారు. ఇలా నాగమ్మను ముప్పుతిప్పలు పెట్టారు.



రామా అనిపించారు..

● శింగనమలకు చెందిన రామాంజనేయులు తన చెల్లెలు భావనను ప్రసవం కోసం ఆదివారం లేబర్ వార్డులో చేర్పించారు. వైద్యచికిత్సలు ప్రారంభించిన డాక్టర్లు రెండు రోజులపాటు భావన ఆరోగ్య పరిస్థితిని గమనిస్తూవచ్చారు. అయినా జ్వరం వస్తోందని పరీక్షలు చేయాలని నిర్ధారణకు వచ్చారు. హెచ్‌బీజీఏజీ, హెచ్ఐవీ, డెంగీ, యూరియా కల్చర్ వంటి పరీక్షలను డాక్టర్లు సూచించారు. వార్డులోని సిబ్బంది శాంపిళ్లను తీసి రామాంజనేయులు చేతిలో పెట్టారు. 12వ నెంబరులోని మైక్రోబయాలజీ విభాగంలో ఇచ్చి రావాలని సూచించారు. అక్కడికి వెళ్లగా శాంపిల్‌ను తీసుకుని రిపోర్టు కోసం మళ్లీ రావాలని సూచించారు. మరుసటి రోజు వెళితే కొన్ని రిపోర్టులను ఇచ్చి పంపారు. వాటిని డాక్టర్‌కు చూపించగా యూరిన్ కల్చర్ వస్తేనే వ్యాధిరకం తెలుస్తుందని చెప్పారు. దీంతో మళ్లీ శుక్రవారం మైక్రోబయాలజీ విభాగానికి వెళ్లి రిపోర్టులు తీసుకువచ్చారు. సిబ్బంది చేయాల్సిన పనులు రామాంజనేయులతోనే చేయించారు.

అనంతపురం వైద్యం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దాస్పత్రిలో వైద్యపరీక్షలంటే బాధితులు బెంబేలెత్తి పరిస్థితి నెలకొంది. ఇక్కడ సిబ్బంది చేయాల్సిన పనిని రోగి బంధువులతో చేయిస్తు, వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. వార్డులో అడ్మిట్ అయిన రోగుల బంధువులే వ్యాధి నిర్ధారణ పరీక్షల శాంపిళ్లను తీసుకెళ్లి విభాగాల వారిగా ల్యాబ్‌ల కలెక్షన్ సెంటర్‌లో ఇవ్వాల్సి వస్తోంది. డాక్టర్లు ఎలాంటి పరీక్షలు రాశారో..? వాటిని ఎక్కడ చేస్తారో? తెలియక రోగులు, వారి బంధువులు బెంబేలెత్తిపోతున్నారు. రోగుల నుంచి శాంపిళ్లు తీసి వాటిని ల్యాబ్‌లో ఇవ్వాల్సిన సిబ్బంది, ఈ ప్రక్రియను పర్యవేక్షించాల్సిన సంబంధిత ఫ్యాకల్టీ, విభాగాధిపతులు పత్తాలేకుండా పోతున్నారు. అయితే రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు అందరూ విధుల్లో ఉన్నామని. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామని కాగితాపై రాసుకుంటు, ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. దీంతో పెద్దాస్పత్రి లో అంతా సవ్యంగా ఉందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), రాష్ట్ర వైద్యవిద్య శాఖ భావిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో రోగులు, వారి బంధులు పడుతున్న ఇబ్బందులను ఇక్కడి అధికారులు తొక్కిపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మైక్రోబయాలజీలో పనిచేస్తున్న విద్యార్థులు

మూడు విభాగాలు

రోగ నిర్ధారణ పరీక్షలను ప్రధానంగా పేథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ అనే మూడు విభాగాలు నిర్వహిస్తాయి. వీటిని ఆయా విభాగాల అధిపతులు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పర్యవేక్షిస్తారు. ఓపీలోని రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు 12వ నెంబరులో శాంపిళ్ల సేకరణ ఏర్పాటు చేశారు. సేకరించిన శాంపిళ్లను సంబంధిత విభాగాల ల్యాబ్‌లకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు. అడ్మిషన్‌లో ఉన్న రోగులకు పరీక్షలు నిర్వహించేందుకు శాంపిళ్లను ల్యాబ్ సిబ్బందే సేకరించాలి. వాటిని ల్యాబ్‌లకు తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించిన అనంతరం రిపోర్టులను తీసుకురావాలి. అయితే వారి పనిని రోగుల బంధువులతో చేయిస్తున్నారు.

మూకుమ్మడి మాయాజాలం

పేథాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ వారిగా ఒక్కో అసిస్టెంట్ ప్రొఫెసర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను ఇన్‌చార్జులుగా డ్యూటీ రోస్టర్ వేస్తారు. విధుల్లో మాత్రం వీరెక్కడా కనిపించరు. హాజరు పట్టికలోనూ వారం, నెల వారి రికార్డుల్లో మాత్రమే కనిపిస్తారు. ఈ విషయం విభాగాధిపతులు, ప్రిన్సిపాల్‌కు తెలియని అంశం కాదు. మూకుమ్మడిగా చేస్తున్న మాయాజాలం ఇది. ఇక్కడితోనే ఆగడంలేదు పరీక్షల నిర్వహణ ప్రక్రియపై ఉన్నతాధికారులు నిర్వహించే సమీక్షల్లోనూ అచ్చుగుద్దినట్లు ప్రెజెంటేషన్ చేస్తున్నారు. మా కళాశాలలో, వైద్యశాలలో డయాగ్నోస్టిక్ ప్రాసెస్‌ను నిబంధనల మేరకు నిర్వహిస్తున్నామని మభ్యపెడుతున్నారు.

ప్రతి నెలా సమీక్షిస్తున్నాం



వ్యాధి నిర్ధారణ పరీక్షల అంశంపై ప్రతి నెలా సమీక్షలు నిర్వహిస్తున్నాం. సమస్యలపై విభాగాధిపతులతో చర్చించి రోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. డ్యూటీ రోస్టర్ ప్రకారం ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, పీజీ విద్యార్థులు వైద్యశాలలోని ల్యాబ్ శాంపుల్ సేకరణ కేంద్రంలో ఉంటున్నారు. వార్డులో శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌లో ఇస్తున్నారు. పరీక్షల అనంతరం కేస్ షీట్లలో రిపోర్టులు రాస్తున్నారు. రోగులతోనే శాంపిళ్లను పంపించడం, రిపోర్టులకు వారినే రావాలని చెప్పడం సరికాదు.

- ప్రొఫెసర్ విజయశ్రీ, వైద్యవిద్య కళాశాల ప్రిన్సిపాల్

త్వరలో అనంతకు ఫార్మా హబ్

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, క్లాక్‌టవర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు త్వరలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని, అనంతపురానికి ఫార్మా హబ్ రాబోతోందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో శనివారం ఆయన లబ్ధిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అర్బన్ పరిధిలో 27 మందికి లబ్ధిదారులకు రూ.19 లక్షల చెక్కులను అందించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి వల్ల విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం గొప్ప పరిణామం అని అన్నారు. డంపింగ్ యార్డ్ నుంచి త్వరలో చెత్తను పూర్తిగా తరలిస్తామని, నగరంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ గురించి వైఎస్ జగన్ తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారంనని మండిపడ్డారు. జగన్ తీరు మారకుంటే ఇప్పుడొచ్చిన 11 సీట్లు కూడా ఉండవని అన్నారు.

రెండు వారాల్లో టిడ్కో ఇళ్లు

టిడ్కో గృహాల నిర్మాణ పనులు రెండు వారాల్లో పునఃప్రారంభించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్, టిడ్కో, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల ఏఎంసీ అధికారులతో కలిసి చిన్మయనగర్ వద్ద టిడ్కో గృహాలను పరిశీలించామని తెలిపారు. ఇప్పటికే 34 బ్లాక్‌ల్లో పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగినట్లు గుర్తించామని అన్నారు. రెండు వారాల్లో నిర్మాణ పనులు పునఃప్రారంభించి, మార్చి చివరికి పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సబ్‌స్టేషన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు సిద్ధం చేయాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సహా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. నగరంలోని అమృత్ 2.0 స్కీం పనులు త్వరితగతిని చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సమావేశంలో పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, ఏఎంసీ ఈఈ చంద్రశేఖర్, డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఈనెల 27న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి

● ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల సాగుచేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రధానంగా వేరుశనగ, కందిపప్పు, శనగ, మొక్కజొన్న, అరటి, టమోటా ఇతర పంటలు దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు రావడంతో నష్ట తీవ్రత పెరిగిందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ సొమ్మును వెంటనే రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

● బీటీపీ రిజర్వాయర్ వద్ద నీట మునిగిన యువకుడు (వివరాలు మెయిన్‌లో)

పాపంపేట వెనుక ప్రకాశ్ రెడ్డి



- జగన్ దృష్టిలో పడేందుకు వివాదం సృష్టి
- వివాదంతో మా కుటుంబానికి సంబంధం లేదు
- పరిష్కారం చూపుతాం..
- బాధితులు బుధవారం రండి
- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

7

బస్సు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్

7

ఇసుక నిల్వలపై విజిలెన్స్ దాడులు

● దాదాపు 70 ట్రాక్టర్ల ఇసుక సీజ్

అనంతపురం క్రైం/కూడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇసుక అక్రమ నిల్వలపై విజిలెన్స్ అధికారులు శనివారం దాడులు చేశారు. కూడేరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన సుబ్బర చిన్న వెంకటేశసులు దొడ్డిలో తనిఖీలు చేయగా అక్రమంగా 96.52 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉంచినట్లు గుర్తించారు. సుబ్బర రామాంజనేయులుకు చెందిన దొడ్డిలో 93.00 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉంచినట్లు గుర్తించారు. నారాయణపురం గ్రామానికి చెందిన మాల నారాయణరెడ్డి కొంత కాలంగా బెళుగుప్ప మండలం కాలువపల్లి నుంచి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలించి ఆ ఇద్దరి కళ్లం దొడ్లలో నిల్వ ఉంచినట్లు విజిలెన్స్ అధికారులు తేల్చారు. అక్రమంగా ఉంచిన మొత్తం (దాదాపు 70ట్రాక్టర్లు)ఇసుకను సీజ్ చేసి వీఆర్వోకు అప్పజెప్పారు. తర్వాత మాల నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని మైన్స్ అండ్ జియాలజీ అధికారులకు సూచించారు. తనిఖీల్లో సీఐ జమాల్ బాషా, ఏఈఈ రాజశేఖర్, గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సుప్రజ, సర్వేయర్ నారాయణ, వీఆర్వో లింగారెడ్డి పాల్గొన్నారు. కాగా స్థానిక వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే ఇసుకను అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం.



ఇసుక డంప్ వద్ద విజిలెన్స్ అధికారులు

తెరుచుకున్న పీఏబీఆర్ గేటు

కూడేరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్(పెన్నోహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) గేటును ఎత్తి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పీఏబీఆర్‌ను ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌రావు, డిప్యూటీ ఎస్ఈ పెంచలయ్య, డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు లక్ష్మీదేవి, ముత్యాలప్ప, గంగమ్మ, రేణుక తదితరులు శనివారం సందర్శించారు. డ్యాంలో నీటి మట్టం పెరుగుతుండటంతో ఇరిగేషన్ అధికారులు ఒక గేటు ద్వారా దిగువనున్న మిడ్ పెన్నార్ డ్యాంకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం 435.900 మీటర్ల వద్దకు చేరుకొని 5.443 టీఎంసీలు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. హంద్రీ-నీవా నుంచి 400 క్యూసెక్కులు, తుంగభద్ర డ్యాం నుంచి 150 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్ డ్యాంలోకి ఇన్‌ఫ్లో ఉండటంతో నీటి మట్టం పెరిగిపోతుంది.

● నిలిచిన జల విద్యుత్ ఉత్పత్తి

పీఏబీఆర్ డ్యాంలోని జల విద్యుత్ కేంద్రంలో కరెంటు ఉత్పత్తి నిలిపివేశారు. కరెంటు తయారు చేసే టర్బైన్ పలుమార్లు మరమ్మతులు వస్తుండటంతో జెన్‌కో అధికారులు నిలిపి వేసినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. జల విద్యుత్ కేంద్రంలో రెండు టర్బైన్లు ఉండగా ఒక టర్బైన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం డ్యాంలోని నీటి నిల్వతో పాటు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోల గూర్చి సంబంధిత అధికారులతో ఎస్ఈ ఆరా తీశారు.



పీఏబీఆర్ గేటు నుంచి నీటి విడుదల

ఫ్రూట్ కేర్ యాక్టివిటీని అమలు చేయండి

జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి

అనంతపురం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అరటి పంటలో ఫ్రూట్ కేర్ యాక్టివిటీని అమలు చేసి, ఎగుమతులు పెరిగేలా చొరవ చూపాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఉద్యాన శాఖ ఏడీ దేవానంద్‌తో కలిసి ఆమె హెచ్‌ఓలతో శనివారం సమావేశమయ్యారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా ఫ్రూట్ కేర్ యాక్టివిటీని అమలు చేసేలా చూడాలన్నారు. సోలార్ కోల్డ్ రూమ్స్, రైపెనింగ్ చాంబర్స్ మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారు ల వివరాలను జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయానికి పంపాలన్నారు.

తుఫాన్‌పై రైతులను అప్రమత్తం చేయండి

● జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలపై రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ వ్యవసాయాధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం ఆమె ఏడీఏలు, ఏఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రబీ సీజన్‌లో పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. పొలాల్లో వర్షపు నీటి నిల్వల మూలంగా పంటలు నష్టపోకుండా తగు జాగ్రత్తలు పాటించేలా చూడాలన్నారు. రబీ సీజన్‌లో పంటల బీమాకు సంబంధించి రైతుల్లో అవగాహన కల్పించి, బీమా ప్రీమియం చెల్లించేలా చొరవ చూపాల న్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు ప్రక్రియపై తనిఖీలు నిర్వహించి, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ధనధాన్య వికాస్ యోజన అమలు కోసం తగిన యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసి, నివేదికలు పంపాలన్నారు.

ఈ- పంట నమోదు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు గడువును ఈనెలాఖరుదాకా పొడిగించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరు దాకా గడువు ఉండింది. క్షేత్ర స్థాయిలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ పంట నమోదు చేయడంలో జాప్యం చేయడంతో ఈనెల 25 దాకా గడువు పొడిగించారు. క్షేత్ర స్థాయిలో ఇంకా ఈ పంట నమోదు పెండింగ్‌లో ఉండటంతో మరో సారి గడువు పొడిగించారు. జిల్లాలో 19.11 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటతో పాటు బీడు పొలాల్లో ఈ పంట నమోదు చేయాల్సి ఉంది. ఇప్పటి దాకా 15.53 లక్షల ఎకరాలను (81 శాతం) ఈ పంట నమోదు చేశారు. గడువులోగా ఈ పంట నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏడీఏలు, ఏఓలను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు.

తుంగభద్రకు నీటి విడుదల 7 బీటీపీకి పెరిగిన వరద

క్రైం కార్నర్

రైతు ఆత్మహత్య


సానే అశోక్‌రెడ్డి (ఫైల్)

నల్లమాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన సానే అశోక్‌రెడ్డి (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాయికుమార్‌రెడ్డి తెలిపిన మేరకు అశోక్‌రెడ్డి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, పొలాలు, పంట సాగు కోసం రూ. 2లక్షలు అప్పు చేశాడని, ఆ అప్పును ఎలా తీర్చేదంటూ తరచూ మథనపడేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తన ఇంటి సమీపంలో ఉన్న గొర్లదొడ్డిలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గొర్లదొడ్డి వైపు వెళ్లి చూడగా అపస్మారస్థితిలో కనిపించాడు. వారు వెంటనే నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య కమలమ్మ, ఒక కుమారుడు ఉన్నారు.

చెరువులో పడి వృద్ధుడు..


తలారి రామన్న(ఫైల్)

పరిగి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరేకోళం గ్రామానికి చెందిన తలారి రామన్న(79) చెరువులోపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. రామన్న గత కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించగా శనివారం ఉదయం చెరువులో శవమై కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంట్లో చోరీ

శింగనమల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోదనపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రైతు జానకొండ నాగభూషణ శుక్రవారం రాత్రి ఇంటికి తాళం వేసి పైన ఉన్న గదిలో భార్య, పిల్లలతో కలిసి నిద్రపోయాడు. ఇది గమనించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంటిలో జొరబడ్డారు. కనిపించిన ట్రంకు పెట్టెను ఎత్తుకెళ్లారు. ఉదయం లేచిన నాగభూషణకు ఇంటి తాళం పగులగొట్టి ఉండటం, ట్రంకు పెట్టె కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రంకు పెట్టెలో 8 తులాల బంగారం నగలు, రూ.50వేలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ విజయ్‌కుమార్, ట్రైనీ ఎస్‌ఐ దయసాగర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని, డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం

విడపనకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుంకులమ్మ గుడి వీధి ఎస్సీ కాలనీకి చెందిన అంజినమ్మ 20 రోజులుగా కనిపించటం లేదని ఆమె కుమారుడు వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు విడపనకల్లు ఎస్‌ఐ ఖాజా హుస్సేన్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు అంజినమ్మ మండలకేంద్రంలోని ఓ హోటల్‌లో పని చేసేది. దసర పండుగకు బళ్లారిలో ఉంటున్న కుమారుడు వెంకటేష్ వద్దకు వెళ్తున్నట్లు హోటల్‌లో చెప్పి బయల్దేరింది. అయితే అంజినమ్మ కొడుకు వద్దకు వెళ్లలేదు. ఈ నెల 2న ఆమె పని చేస్తున్న హోటల్ యజమానులు ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావ్ అడగగా తాను ఇల్లూరులోని తన కుమార్తె వద్దకు వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఇక అప్పటి నుంచి సెల్ స్విచ్ఛాఫ్ వస్తోందని, అన్ని చోట్లా గాలించినా ఫలితం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాపర్ వైరు చోరీచేసే ముఠా అరెస్ట్

- నిందితులందరూ అమలాపురం వారే


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ శ్రీకాంత్, ఇతర అధికారులు

అనంతపురం క్రైం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బీఎస్ఎన్‌కు చెందిన కాపర్ కేబుల్‌ను చోరీ చేసిన దొంగల ముఠాలో 12మందిని అనంతపురం టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 40 వేల విలువైన రాగి వైరు, ఒక ట్రక్కును స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సీఐ శ్రీకాంత్ యాదవ్ స్టేషన్‌లో శనివారం రాత్రి వెల్లడించారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ముందు భూమిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కేబుల్ చోరీ చేసిన దొంగలను పట్టుకోవాలంటూ బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఆఫీసర్ గంగాధర్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల్లో లభించిన చిన్న ఆధారాన్ని పట్టుకుని దర్యాప్తులో ముందుకెళ్లారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో నిందితులున్నట్టుగా సమాచారం రావడంతో వెళ్లి అరెస్టు చేశారు. అరెస్టైయిన నిందితులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. అరెస్టయిన వారిలో వేముల ఉదయ్‌భాస్కర్(25),వేముల ఏసుబాబు(28),వేముల శివనారాయణ(27), నక్కా తిరుమల శ్రీనివాసులు(21),వేముల వేంకటాద్రి(25), గుజ్జదుర్గారావు(35), గుజ్జశీను(30), గాలి రాజు(50), గాలి చంటి(28),వేముల సుబ్బరాజు(33), గుజ్జ సింహాద్రి(24), చల్లా దుర్గారావు(38) ఉన్నారు. ఈ కేసులో మొత్తం 17 మంది నిందితులున్నారని, మిగతా ఐదుగురిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

పెళ్లికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- తల్లి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు


డివైడర్‌ను ఢీకొన్న కారు

కనగానపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం దాదులూరు వద్ద జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. రామ్మోహన్ తన తల్లి రామాంజనమ్మతో(49) కలిసి బంధువుల పెళ్లికి బెంగళూరు వెళ్లాడు. తిరిగి శుక్రవారం రాత్రి తన కారులో తల్లితో కలిసి స్వగ్రామానికి బయల్దేరాడు. దాదులూరు వద్ద ఆవు అడ్డు రావడంతో సడన్‌గా బ్రేక్ వేసి పక్కకి తిప్పాడు. దీంతో రోడ్డు పక్కనున్న డివైడర్‌ను కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామాంజనమ్మ కారులోనే మృతి చెందారు. కారుకు ఉన్న బెలూన్ ఓపెన్ కావడంతో రామ్మోహన్ ప్రాణాలతో బయడపడ్డాడు. గాయపడ్డ రామ్మోహన్‌ను అనంతపురం ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన రామాంజినమ్మ

పాపంపేట వెనుక ప్రకాశ్‌రెడ్డి

- జగన్ దృష్టిలో పడేందుకు వివాదం సృష్టి
- మా కుటుంబానికి సంబంధం లేదు
- పరిష్కారం చూపుతాం.. బాధితులు బుధవారం రండి
- టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

అనంతపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాపంపేట భూ వివాదం వెనుక రాజకీయ నిరుద్యోగి ప్రకాష్ రెడ్డి కుట్ర ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. అందులో ఎవరూ పావులుగా మారొద్దని కోరారు. ఈ వివాదం గురించి శనివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అధికారులతో మాట్లాడి సమస్య గురించి తెలుసుకున్నానని, 930 ఎకరాల సమస్య అని ప్రజల్ని భయాందోళనకు గురి చేశారన్నారని అన్నారు. సమస్య కేవలం 20 ఎకరాలదేనని అన్నారు. అది కూడా కోర్టులో ఉందని అన్నారు. ప్రకాష్ రెడ్డి, మరికొందరు వైసీపీ నాయకులు ఈ వివాదాన్ని సృష్టించారని ఆరోపించారు. ప్రకాష్ రెడ్డిని ఇన్‌చార్జిగా కూడా తొలగిస్తారన్న ప్రచారం జరుగోందని, అందుకే లేని వివాదాన్ని సృష్టించి జగన్ రెడ్డి దృష్టిలో పడాలని చూస్తున్నారని అన్నారు. 'వదంతులను ఎవరూ నమ్మవద్దు. మీ ఇంటి జోలికి ఎవరూ రాలేరు. మీ మీద చేయి పడాలంటే మమ్మల్ని దాటి పోవాలి. పాపంపేటలో ఒక్క ఇంటి మీద చేయి పడినా అది మా ఇంటి మీద పడినట్లే..' అని అన్నారు. ఇది ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ వైపు నుంచి ఇస్తున్న మాట అని అన్నారు. విద్యారణ్య నగర్ భూ బాధితులు తమ వద్దకు వస్తే రూ.2 కోట్లకు 4.20 ఎకరాలు వచ్చేలా చూశామని అన్నారు. ఆ రోజు కూడా ప్రకాష్‌రెడ్డి తాను డబ్బు తీసుకున్నట్లు ప్రచారం చేశారని అన్నారు. ఇక్కడి బాధితులు ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కలిస్తే.. 'నాకు రిజిస్టర్ చేయండి.. నేను చూసుకుంటా' అని చెప్పలేదా అని ప్రశ్నించారు. పాపంపేట భూ వివాదంతో తమ కుటంబానికి సంబంధం లేదని అన్నారు. ఇందులోకి తన పేరు లాగితే తాను బయటకొచ్చి మాట్లాడుతానని, తన సోదరుడు సిద్ధార్థ అయితే మాట్లాడరని ప్రకాశ్ రెడ్డి నిందలు వేశారని మండిపడ్డారు. తాము ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటామని అన్నారు. ప్రకాష్ రెడ్డి పాములా మారి, సొంత పార్టీ నాయకుల సొమ్ముతిని, ఆస్తులు లాక్కున్నాడని విమర్శించారు.

జగన్‌కు ఎంత వాటా ఇచ్చావ్?

పాపంపేట భూ వివాదంలో మంత్రి నారా లోకేశ్‌కు వాటాలు వెళ్లాయని ప్రకాష్‌రెడ్డి చెప్పడం హాస్యస్పదంగా ఉందని శ్రీరామ్ అన్నారు. అందరూ ఆయనలాగా ఉండరని అన్నారు. అమ్మ డెయిరీ, ఆలమూరులో భూ కబ్జా, పాపంపేట తాగునీటి పైప్‌లైన్ గుడ్‌విల్, ప్రభుత్వ వైన్ షాపుల్లో కర్నాటక మద్యం అమ్మకాలలో జగన్‌కు ఎంత వాటా ఇచ్చావు అని నిలదీశారు. ముత్యాలమ్మ ఆలయంలో అక్రమాల గురించి విచారణ చేయాలని తామే కోరుతామని అన్నారు. వైసీపీ హయాంలో తనకు గన్‌మెన్‌లను ఇచ్చింది తన రక్షణ కోసం కాదని, ప్రకాశ్ రెడ్డి రక్షణ కోసమేనని అన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో జరిగిన అక్రమాలు త్వరలోనే బయటకొస్తాయని, అందులో ప్రకాశ్ రెడ్డి నిందుతుడిగా ఉంటాడని అన్నారు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు పాపంపేట వివాదాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు. ఈ వివాదంలో సుభాష్ రెడ్డి, శ్రీరాములు వైసీపీ వారేనని, కనగానపల్లిలో ప్రకాష్ రెడ్డి అనుచరుడి సొంత బావమరిది శ్రీరాములు అని అన్నారు. పాపంపేట వివాదాన్ని పెద్దదిగా చేసేందుకు ప్రకాశ్ రెడ్డి కొందరు జర్నలిస్టులతో మాట్లాడి, ప్రోత్సహించారని ఆరోపించారు. పాపంపేట వివాద పరిష్కారం కోసం బుధవారం తన వద్దకు రావాలని, తనను రమ్మన్నా వస్తానని శ్రీరామ్ అన్నారు. రాజకీయలకు అతీతంగా బాధితులు, పాపంపేట పెద్దలు కలసి ఒక నిర్ణయానికి రావాలని కోరారు. సమస్య కోర్టు పరిధిలో ఉందని, ఎలా ముందుకు వెళ్లాలో అధికారులతో మాట్లాడి సమాచారం తీసుకుంటామని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదని, పాపంపేటలో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వబోమని అన్నారు. సమావేశంలో టీడీపీ మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, రాచానపల్లి సింగిల్ విండో అధ్యక్షులు పాముురాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

రేపు మహనీయుల విగ్రహావిష్కరణ

చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిద్దాం
టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామం వద్ద ఈ నెల 27న బాబూ జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ జరుగుతుందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చరిత్రలో ఈ కార్యక్రమం నిలిచిపోయేలా నిర్వహిద్దామని ఆయన టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలసి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎందరి జీవితాల్లోనో వెలుగు నింపిన బాబూ జగ్జీవన్‌రామ్, రాజ్యాంగాన్ని అందించి ఎందరికో స్ఫూర్తినిచ్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ప్రభుత్వ విప్‌లు, ఇద్దరు ఎంపీలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్యేలు కోడుమూరు దస్తగిరి, విజయ్‌చంద్ర, మురళీమోహన్, సోంగా రోషన్‌కుమార్, శ్రీనివాసరావు, జయసూర్య, శ్రీధర్, విజయ, శ్రావణి, నందిగామ సౌమ్య, వెంకటరాజు, కుమార్ రాజవర్ల, సత్యనారాయణ, డాక్టర్ వీఎం థామస్, రామాంజనేయులు తదితరులు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ హాజరవుతారని తెలిపారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కలిసికట్టుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకు నీరు అందిస్తాం: ఎమ్మెల్యే


నీటిని విడుదల చేయిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్ రెడ్డి

పెద్దపప్పూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు నీరు అందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చాగల్లు రిజర్వాయర్ నుంచి శనివారం పెండేకల్లు రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జలహారతినిచ్చి నీటిని విడుదల చేశా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని వి ధంగా చాగల్లు రిజర్వాయర్‌కు నీరు వచ్చాయన్నారు. యాడికి, పెద్దవడుగూరు మండలాలకు కూడా నీరు సమృద్ధిగా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న నీటి నిల్వ ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.60కోట్లు విడుదల చేస్తే ప్రతి ఎకరాకు నీరు అందివచ్చని శుక్రవారం జరిగిన ఐఏబీ సమావేశంలో తెలిపానన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తానన్నారు. మండల కన్వీనర్ తాతిరెడ్డి లోకనాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ బీసీ రామకృష్ణారెడ్డి, బాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మండల తెలుగుయువత ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, రిజర్వాయర్ ఏఈ హరినాథ్‌రెడ్డి, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ ఎంపికకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఎంపిక కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతకు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇప్పించడానికి ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం అసిస్టెంట్ కలెక్టరు సచిన్‌రహార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుముద, ఆర్టీఓ సమక్షంలో ఇంటర్వ్యూలు చేపట్టారు. మొత్తం 53మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 35మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు కుముద తెలిపారు.

బార్లలో ఎమ్మార్పీకే అమ్మితే ఎలా?

- నష్టపోతున్నామని దుకాణదారుల ఆవేదన

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మద్యాన్ని బార్లలో కూడా ఎమ్మార్పీకే విక్రయిస్తుండటంతో తాము నష్టపోతున్నామని పలువురు మద్యంషాపు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో మద్యంషాపు నిర్వాహకులు చంద్రశేఖర్ నాయుడు, శ్రీనివాసులు, సాయిప్రసాద్, వెంకటరమణ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ బార్లలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మార్పీకే మద్యం విక్రయిస్తుండటం, అక్కడే సిట్టింగ్ ఏర్పాటు చేయడంతో మద్యంషాపుల వ్యాపారాలు దెబ్బతింటున్నాయన్నారు. నెలనెలా రూ. 5 లక్షల వరకూ నష్టాల చవిచూడాల్సి వస్తోందన్నారు. పైగా ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యంషాపులకు ఇవ్వాల్సిన 20 శాతం రాయితీ ఇవ్వకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బార్లలో ఎమ్మార్పీతో మద్యం విక్రయాలు జరిపితే నిర్వాహకులు షాపులు మూసేసి తాళాలు ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పేరూరు టీచర్


బహుమతిని అందుకుంటున్న పేరూరు చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గురుకుల పాఠశాల చిత్రకళ ఉపాధ్యాయుడు శ్రీరాములు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్‌టీ సంయుక్తంగా రాష్ట్ర స్థాయి ఆర్ట్ ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై నిర్వహించిన సంవృద్ధి పోటీల్లో శ్రీ రాములు ప్రతిభ చాటారన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగిన పోటీలలో శ్రీరాములు, పూలమతి గ్రామ జడ్పీ స్కూల్ ఉపాధ్యాయురాలు మెరిసిరాణి సంయుక్తంగా ప్రతిభచాటి రాష్ట్రస్థాయిలో తృతీయ బహుమతి సాధించారన్నారు. ఈక్రమంలో వీరు నవంబరులో న్యూఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బస్సు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన కావేరి బస్సు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవరగుడి జగదీష్ డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బస్సు ప్రమాద మృతులకు పార్టీ తరఫున సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం రూ.5 లక్షలు, ఏపీ ప్రభుత్వం రూ.5 లక్షలు, ప్రధాని మోదీ రూ.2 లక్షల పరిహారాన్ని ప్రకటించారని, బాధిత కుటుంబాలకు ఈ సొమ్ము ఏమాత్రం సరిపడదని అన్నారు. గతంలో జబ్బార్ బస్సు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారని, అదే తరహా పరిహారం ఇవ్వాలని కోరారు. అనుమతులు లేని, కాలం చెల్లిన బస్సులు అనేకంగా తిరుగుతున్నాయని అన్నారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వేగ నియంత్రణకు కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని అన్నారు. అందుకే ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ఆర్టీఏ అధికారుల అవినీతి, ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర రవాణా శాఖ మంత్రుల నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. బెంగుళూరు-హైదరాబాద్ హైవే నిర్వహణ అధ్వానంగా ఉందని, ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడ్డాయని అన్నారు. నిత్యం ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయని అన్నారు. ఘోర ప్రమాదాలు జరిగినపుడు మాత్రమే అధికారులు, పాలకులు హడావుడి చేసి, ఆ తరువాత వదిలేస్తున్నారని అన్నారు. మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు సమన్వయంతో ప్రమాదాల నివారణకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


బీటీపీ గేటు ఎత్తడంతో విడుదలవుతున్న నీరు

బీటీపీకి పెరిగిన వరద

గుమ్మఘట్ట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు దిగువన ఉన్న బీటీపీకి వరద నీరు చేరుతోంది. దాదాపు రెండువేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈక్రమంలోనే శనివారం బీటీపీ ఆరో గేటు ఎత్తి 1550 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కేవీట్యాంక్ నింపేందుకు ఎడమ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు విడుదల చేశారు. బీటీపీ పూర్తిస్థాయి నీటిమట్టం 1655 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1653 అడుగులకు చేరింది. వరదనీరు పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని విడుల చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తుంగభద్రకు నీటి విడుదల


విద్యుత్ కాంతుల్లో టీబీడ్యామ్

కంప్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి శనివారం ఆరు క్రస్ట్‌గేట్లు తెరచి అధికారులు నీరు విడుదల చేశారు. జలాశయం ఎగువన అధిక వర్షాల కారణంగా డ్యామ్‌లో నీటి మట్టం 80 టీఎంసీలకు పైగా చేరింది. దీంతో డ్యామ్ నిపుణుల సలహా మేరకు బోర్డు అధికారులు గేట్లు తెరిచి నీటిని వదిలారు. ఇప్పటికే నదీతీరాన వుండే గ్రామాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాత్రి విద్యుత్ కాంతుల్లో జలాశయం విశేషంగా ఆకట్టుకుంది. నీటి ప్రవాహాన్ని చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోండి: పీడీ

అనంతపురం అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెంచిన స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ శైలజ స్వయం సహాయక సంఘాల సభ్యులకు సూచించారు. స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో శనివారం మహాసభ సమావేశాన్ని నిర్వహించారు. పీడీ శైలజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏ - గ్రేడ్ గ్రామ సంఘాలకు రూ.75 లక్షల నుంచి రూ.కోటి దాకా రుణ మంజూరు పరిధిని పెంచిందన్నారు. బీ గ్రేడ్ సంఘాలకు రూ.65లక్షల నుంచి రూ.90 లక్షలు, సీ గ్రేడ్ సంఘాలకు రూ.50లక్షల నుంచి రూ.80 లక్షలు, డీ గ్రేడ్ సంఘాలకు రూ.40లక్షల నుంచి రూ.70 లక్షలకు రుణం మంజూరును పెంచినట్లు తెలిపారు. నవంబరు నుంచి పెంచిన రుణాలను గ్రేడ్‌ల ఆధారంగా మంజూరు చేస్తామన్నారు. మండల సమాఖ్యలకు 90 రోజులు దాటిన తర్వాత రూ.20 లక్షలకు మించి బకాయి ఉంటే రుణాన్ని మంజూరు చేసేవారుకాదన్నారు. తాజాగా బకాయి రూ.30 లక్షల వరకు ఉన్నా తిరిగి రుణాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ విషయాలను క్షేత్ర స్థాయిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు తెలియజేసి, అమలు జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ రాధారాణి, డీపీఎంలు రవీంద్రబాబు, రాజ్యలక్ష్మీ, స్త్రీనిధి ఏజీఎం దయాసాగర్, ఏపీఎం సుభద్రమ్మ, మండల సమాఖ్యల అధ్యక్షులు, స్త్రీనిధి సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలందించడమే లక్ష్యం

- సిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి యాజమాన్యం
- నేడు ఆస్పత్రి ప్రారంభం



అనంతపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని సిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలో కొత్తగా నిర్మించిన ఆస్పత్రిని ఆదివారం ఉదయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులతో 300పడకలతో ఆస్పత్రిని అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే అందించాలన్న ఉద్దేశంతో ఆస్పత్రిని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఎనిమిది మాడ్యులర్ లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు, వంద పడకల ఐసీయూ సౌకర్యం, 20పడకల నియోనటాల్, పీడియాట్రిక్ ఐసీయూ ఏర్పాటు చేశామన్నారు. 25కు పైగా శస్త్ర చికిత్సలు అందించే సేవలతో పాటు ప్రపంచ స్థాయి డయాగ్నస్టిక్ సేవలు, అత్యాధునికమైన సిమ్స్ 1.5టిఎంఆర్ఐ, 128 స్లైస్ సిటీ స్కానర్, అధునాతన ల్యాబ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా తక్కువ ధరలకే వైద్య సేవలు అందిస్తామన్నారు.

5 లోగా పీఎంఏవై సర్వే పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) గ్రామ సర్వేను నవంబరు 5వ తేదీలోగా పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల హౌసింగ్ పీడీలు, ఈఈలు, డీఈలు ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్టీఆర్ హౌసింగ్ వెరిఫికేషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, 2016 నుంచి 2019 వరకూ పెండింగ్‌లో ఉన్న ఇళ్లను మొబైల్ యాప్‌లో సర్వే చేయడం, 2021- 2024 మధ్య మంజూరైన ఇళ్లు, పెండింగ్ పనులు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. పీఎంఏవై గ్రామ సర్వేను వచ్చే నెల 5వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే తహసీల్దార్ల నుంచి పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో ఆలస్యమవుతోందని, సమస్యను రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి.. ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలని సూచించారు. గత ప్రభుత్వంలో పట్టాలు తీసుకుని ఇప్పటి వరకు ఇళ్లు నిర్మించుకోని వారి వివరాలు సేకరించాలన్నారు. పీఎంఏవై కింద ఇచ్చే రూ. 1.50 లక్షలు ఏ మాత్రం సరిపోవడం లేదంటూ లబ్ధిదారులు చెబుతున్నారని, ఆ మొత్తం పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

కనగానపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దలచెరువు గ్రామంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను వాల్మీకి కులస్థులు ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఎద్దుల పరుగు పోటీలు నిర్వహించారు. అందులో గోపుదారిపల్లి ఆదినారాయణకు చెందిన ఎద్దులు విజయం సాధించాయి. తర్వాత ఆ ఎద్దుల యజమానికి నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం ఓబుళమ్మ

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని ఉన్నతపాఠశాలలో శనివారం నిర్వహించిన మండల స్థాయి వ్యాసరచన, వకృత్వ, క్విజ్‌పోటీల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మండలంలోని ఏడు ఉన్నతపాఠశాలలతో పాటు మోడల్‌స్కూల్, కేజీబీవీలకు చెందిన 30 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అందులో వ్యాసరచన, వకృత్వపు పోటీల్లో కేజీబీవీకి చెందిన వర్షిత, వాసవి, క్విజ్‌లో మోడల్ స్కూల్‌కు చెందిన ఈశ్వరయ్య మండలస్థాయి విజేతలుగా నిలిచారు. వీరు నియోజవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, హెచ్ఎం ఓబుళమ్మ తెలిపారు.

టింబక్టు కార్యాలయంలో కలెక్టర్



సంస్థ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయాన్ని కలెక్టర్ శ్యాంప్రసాద్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు బబ్లూగంగూలి, మేరి వటమట్టంతో మాట్లాడి సంస్థ చేస్తున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ధరణి, ప్రాసెసింగ్ సెంటర్, ఆదిశక్తి మహిళా కో ఆపరేటివ్ సొసైటీ, భవాని చేనేత సంఘం కార్యాలయాలను సందర్శించి పురోగతిపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ సురేశ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కందుకూరులో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

అనంతపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అలాగే కళాశాల అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర , ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఉషారాణి, కోఆర్డినేటర్ మురళీధర్‌రావు , హెచ్ఎం సాయిప్రసాద్, సర్పంచు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా ఆధ్వర్యంలో ప్రస్తుత కాలంలో పోలీస్ వ్యవస్థలో సాంకేతిక పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల నుంచి హాజరైన పోలీసు సిబ్బందికి వ్యాసరచన, వకృత్వపు పోటీలు నిర్వహించారు. ఏఆర్ ఎస్ఐలు పవన్‌కుమార్, బాబ్జాన్, మక్బూల్, రమేష్ నాయక్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 10 మంది పేకాటరాయుళ్లను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. టీవీ టవర్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు చేశామని, అక్కడ పేకాట ఆడుతున్న10 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.45 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వీహెచ్‌పీ శిక్షణ తరగతులు ప్రారంభం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్ నైపుణ్య శిక్షణా తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ తరగతులను అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలో గల ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో బీజేపీ రాష్ట్ర సెల్స్ కన్వీనర్ కనంపల్లి చిరంజీవిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. 16జిల్లాల నుంచి సుమారు 140మంది వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు. శిక్షణలో సంస్థాగత నిర్మాణం, కార్యశైలి, ప్రస్తుత సామాజిక అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణు మళయాన్, భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ల రవికుమార్, ఏపీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బజరంగదళ్ రెండు రాష్ట్రాల సంయోజక్ కుమారస్వామి, కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళంకి రత్నమయ్య, విశ్వనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న చిరంజీవిరెడ్డి

నిలిచిన 108 సేవలు

● మండలంలో రెండు నెలలుగా కానరాని వాహనం

● అత్యవసర పరిస్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి చేర్చాలంటే ఇబ్బంది పడుతున్న ప్రజలు



గార్లదిన్నె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో 108 వాహన సేవలు కనుమరుగయ్యాయి. ఉన్నట్టుండి తీవ్రఅనారోగ్యానికి గురైన వారికి, ప్రమాదాలలో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాథమిక చికిత్స చేసి ఆస్పత్రులకు తరలించేందుకు గాను ప్రభుత్వం 108 వాహనాలను ప్రవేశపెట్టింది. వీటి సేవలు పట్టణాలతో పాటు గ్రామాల్లో ప్రజలు కూడా వినియోగించుకునేందుకు వీలుగా ప్రతి మండల కేంద్రంలోనూ ఆ వాహనాలను ఉంచారు. ఈ క్రమంలో గార్లదిన్నె మండలంలో ఉన్న 108 వాహనం ఇటీవల మరమ్మతులకు గురవడతో అనంతపురంలోని షెడ్‌లో ఉంచారు. దీంతో మండలంలో సుమారు 2 నెలలు నుంచి ఆ వాహనం అందులోబాటులో లేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారిని ఆస్పత్రులకు తరలించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా గార్లదిన్నె మీదుగా హైదరాబాద్- బెంగళూరుకు 44వ జాతీయ రహదారిపై నిత్యం బస్సులు, ఆటోలు, లారీలు, వివిధ లగేజీ వాహనాలు వేలాదిగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో రహదారిపై ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు 108 వాహనం అందుబాటులో లేక ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. శింగనమల, పామిడి నుంచి వాహనాలు వచ్చే లోపు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న మండల కేంద్రంలో 108 వాహనం లేకపోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం కనుంపల్లి వద్ద ఆర్టీసీ బస్సును కారు ఢీ కొని ముగ్గురు గాయపడ్డారు. సమయానికి 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో పోలీసులు జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాలను నిలిపి అందులో క్షతగాత్రులను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఇలాంటి ఘటనలు అనేకం ఉన్నాయి. హైవేలోనే ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అధికారులు గుర్తించాలని, ఇప్పటికైనా 108 వాహనాన్ని మండలకేంద్రంలో అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే అందుబాటులో ఉంచుతాం..

గార్లదిన్నెలో ఉన్న 108 వాహనం పాతది కావడంతో రిపేరి వచ్చింది. దీంతో అనంతపురంలోని షెడ్‌లో ఉంచాం. కొత్త వాహనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 190 వాహనాలను కొత్తవాటిని ఇస్తున్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాకు దాదాపు 20 వాహనాలకు పైగా కొత్తవి వస్తున్నాయి. త్వరలోనే సీఎం చేతుల మీదుగా కొత్త 108 వాహనాలు ప్రారంభిస్తారు. అప్పుడు గార్లదిన్నెకు కొత్త 108 వాహనాన్ని అందుబాటులో ఉంచుతాం.

-అనిల్‌కుమార్, 108 వాహనాల జిల్లా మేనేజర్

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి: సీపీఐ



ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ శ్రేణులు

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలో వేలాదిమందిని ఆందోళనకు గురి చేస్తున్న భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద శనివారం వారు పాపంపేట భూఆక్రమణ వ్యవహారంపై బాధితులకు మద్దతుగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఇటీవల పాపంపేటలో శ్రోత్రియం భూముల పేరుతో కొందరు స్థలాల ఆక్రమణకు పూనుకుంటున్నారన్నారు. వారికి మండల రెవెన్యూఅధికారులు పెద్దఎత్తున ముడుపులు తీసుకొని పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. వెంటనే ఉన్నతాధికారులు ఆ సర్టిఫికెట్లు రద్దు చేసి, వాటిని ఇచ్చిన రెవెన్యూ అధికారులపై, భూ కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కేశవనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, నగరకార్యదర్శి శ్రీరాములు, నాయకులు రమణయ్య, లింగమయ్య, పద్మావతి, లోకసత్తా నేత వేలూరు ఆశోక్‌తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు విశేష స్పందన



రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న విద్యుత్‌శాఖ ఈఈ శివరాములు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ఎస్‌గేటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. పుట్టపర్తి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వినియోగదారులు పలు సమస్యలతో హాజరయ్యారు. ప్రధానంగా చెన్నేకొత్తపల్లి, మేడాపురం గ్రామాల్లో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని పలువురు వినతులు అందజేశారు. అదేవిధంగా హరియన్ చెరువు, న్యామద్దల గ్రామాల రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఈఈ శివరాములు తెలిపారు. డీఈఈ లక్ష్మీనారాయణ, ఏఈఈ రామాంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామగ్రి వితరణ

అనంతపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సాయి ట్రస్టు వారు కూడేరు మండలం గొట్కూరులోని బెరాక వృద్ధాశ్రమానికి సామగ్రి వితరణ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ శనివారం వృద్ధాశ్రమాన్ని సందర్శించి అక్కడికి అవసరమైన ఫ్రిడ్జ్, బీరువా, వాషింగ్ మిషన్‌ను దాత రోహిత్ సహకారంతో వితరణ చేశారు. అలాగే వృద్ధులకు అన్నదానం చేపట్టారు.

సమాజ సేవకులకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ముక్తాపురం గోవిందు

కనగానపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేయడంతో పాటు ఆ సేవ పట్ల ప్రజలను చైతన్య పరిచిన ఇద్దరు యువకులకు అవార్డులు వచ్చాయి. ముక్తాపురానికి చెందిన గోవిందు, సీతారాంపల్లికి చెందిన శ్రీనివాసులు అవార్డులు దక్కించుకున్నారు. శనివారం తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లోని ఏసియా యూనివర్శిటీ అంతర్జాతీయ సదస్సులో హనోరరీ డాక్టరేట్, అచీవ్‌మెంట్ అవార్డులను వక్తలు ప్రదానం చేశారు. ఈ మేరకు అవార్డు గ్రహీతలు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యపై సభ్యుల ఏకరువు

● ఏఎంసీ స్టాండింగ్ కమిటీలో 33అంశాలకు ఆమోదం



సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్, సభ్యులు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): నగరంలో పెరిగిపోతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరించి.. సమస్య పరిష్కరించాలని అనంత నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఏకరువు పెట్టారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం మేయర్ మహమ్మద్ వసీం అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. నగరంలోని ప్రధాన ప్రాంతాలైన సప్తగిరిసర్కిల్, రాజురోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, సాయినగర్, అశోక్‌నగర్, విద్యుత్తునగర్, కమలానగర్, కళ్యాణదుర్గం రోడ్డు, పాతూరులలో అధికంగా ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారని, ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే ప్రజలను వేధిస్తున్న కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఇక వర్షాలు అధికంగా పడుతుండడంతో ప్రజలకు వరద ముప్పు పొంచి ఉందని, దాని నుంచి విముక్తి కల్పించే చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా ప్రధాన రహదారులు, వీధులతో పాటు నడిమివంక, మరువవంకలలో ఆక్రమణలను తొలగించాలని, అలాగే వంకల్లో మురుగు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల పూడికను తీయించాలని అన్నారు. ఏఎంసీ కమిషనర్ బాలస్వామి స్పందిస్తూ.. సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం మొత్తం 33 అంశాలను మేయర్ మహ్మద్ వసీం ప్రతిపాదనతో స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సభ్యులు మల్లికార్జున, జయలలిత, రామాంజినమ్మ, దేవి, ఏఎంసీ ఈఈ షాకీర్, ఆర్ఓ విజయ్‌కుమార్, ఏసీపీ వనజాక్షి, ఎంహెచ్ఓ నరసింహులు పాల్గొన్నారు.

రేపు మండల స్పోర్ట్స్‌మీట్

రామగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈ నెల 27వ తేదీ సోమవారం మండల స్పోర్ట్స్‌మీట్‌ను నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం మహాలక్ష్మి, కోఆర్డినేటర్ విజయలక్ష్మి తెలిపారు. పాఠశాలలో శనివారం వారు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. మండల స్పోర్ట్స్‌మీట్‌లో అండర్-14, 17 విభాగాలకు సంబంధించిన బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి మండల స్థాయి జట్లను ఎంపికచేయనున్నామన్నారు. ఎంపికైన జట్లు డివిజన్ స్థాయిలో పాల్గొంటాయన్నారు. ఈ స్పోర్ట్స్ మీట్‌కు మండలంలోని ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

నార్పలలో స్కూల్ గేమ్స్..

నార్పల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 27న స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల పీడీ ఆంజనేయులు తెలిపారు. ఈపోటీలలో కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. 14, 17 మధ్య వయస్సు ఉన్న విద్యార్థులు అర్హులని వెల్లడించారు.మండల విద్యాధికారి, పాఠశాల హెచ్ఎం పర్యవేక్షణలో ఈ స్కూల్ గేమ్స్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ సంబంధించి ఈనెల 27,28 తేదీలలో సీకేపల్లి ఉన్నతపాఠశాలలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల పీడీ విజయనిర్మల శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24,25వ తేదీల్లో జరగాల్సిన ఈ పోటీలు వర్షాలకారణంగా వాయిదా పడ్డాయన్నారు. దీంతో తిరిగి పైన పేర్కొన్న తేదీలలో క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు.

రామసుబ్బారెడ్డి బాధ్యతల స్వీకరణ

అనంతపురం విద్య, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ఈడీగా రామసుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు పని చేస్తున్న సుబ్రహ్మణ్యం ఉద్యోగవిరమణ పొందారు. తర్వాత ఆయన స్థానంలోకి రెగ్యులర్ ఈడీ నియామకం జరగలేదు. దీంతో మైనార్టీ వెల్ఫేర్‌శాఖ డీడీగా ఉన్న రామసుబ్బారెడ్డికి ఎఫ్ఏసీగా కలెక్టర్ ఆనంద్ బాధ్యతలు అప్పగించారు. ఈనేపథ్యంలో ఆయన కార్యాలయానికి వెళ్లి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆశాఖ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

సెమినార్..

అనంతపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ ఇంజనీరింగ్ కళాశాలలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ స్కూల్లో శనివారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రొఫెషనల్ అండ్ అకడమిక్ ఎక్సలెన్స్ మాస్టరింగ్ రెజ్యూమే బిల్డింగ్ అండ్ రీసెర్చ్ పేపర్ అనే అంశంపై సెమినార్ జరిగింది. కార్యక్రమానికి బెంగళూరులోని ఎస్ఈఏ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త హనుమాన్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అనిల్ కుమార్ రెజ్యూమే రచనపై సమగ్రమైన ఇంటరాక్టివ్ సెషన్‌ను పెంపొందించారు. అధ్యాపకులు, సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద మృతులకు ఏఐఎస్ఎఫ్ నివాళి

● నగరంలో కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వారికి అంజలి ఘటిస్తూ నగరంలో శనివారం సాయంత్రం ఏఐఎస్ఎఫ్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ నుంచి టవర్‌క్లాక్ వరకు కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రమాద ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్, ఆంజనేయులు, చందు, ఉమేష్, సాయిఅరవింద్, రాజు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ముంపు నుంచి రక్షణ కల్పించండి

● కలెక్టర్‌కు విన్నవించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న దగ్గుపాటి ప్రసాద్

అనంతపురం క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నడిమివంక వరద ముంపు నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని, వంక ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం ఆయన కలెక్టర్ ఆనంద్‌ను కలిసి పలు సమస్యలను వెల్లడించారు. నడిమివంక వరద ముంపు వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆ ప్రాంతంలో కొందరు అనధికారికంగా నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. వీరికి ప్రత్యామ్నాయం చూపడంతో పాటు వంకకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే నగరంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పాతూరులోని తాడిపత్రి బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ శిథిలావస్థకు చేరిందని, దానిని కూల్చివేసి ఆధునిక సౌకర్యాలతో కొత్తది నిర్మించాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ గెస్ట్‌హౌస్ స్థానంలో పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) మోడ్‌లో కొత్త గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆలమూరు, సనప చెరువులు మరువ పారడంతో ఆ నీళ్లు రుద్రంపేట ప్రాంతంలోని కాలనీల్లోకి వస్తున్నాయని, భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా చెరువు నీళ్ల ప్రవహించేలా కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇక ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నా క్యాంటీన్ ఏర్పాటుచేయాలని విన్నవించారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ.. సంబంధిత అధికారులతో చర్చించి .అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

గార్లదిన్నె, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి రన్నింగ్ పోటీలకు మండలంలోని యర్రగుంట్ల గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సి. శ్వేత ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ రమేష్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శ్వేత ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలోని పెదవేగి పరిధిలో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొందన్నారు. అందులో ప్రతిభ కనబరచి వెండి పథకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. నవంబరులో హరియాణా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఇందుకు ఆ విద్యార్థినిని శనివారం పీడీతో పాటు హెచ్ఎం గురుకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓబిరెడ్డి దంపతులకు నియామక పత్రాలు

అనంతపురం క్రైం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అఖిల సనాతన సంఘటన్ సంస్థ సౌత్ ఇండియా కో-ఆర్డినేటర్‌గా తనను నియమించినట్లు సాయి ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ఓబిరెడ్డి శనివారం తెలిపారు. అలాగే రాష్ట్ర మహిళా కో-ఆర్డినేటర్‌గా తన సతీమణి గజలక్ష్మిని నియమించినట్లు చెప్పారు. దేశవ్యాప్త పర్యటనలో భాగంగా అనంతపురం వచ్చిన సనాతన సంఘటన్ సంస్థ ఫౌండర్, చైర్మన్ కేతన్ పరాగ్ దంపతులు, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప చేతుల మీదుగా ఈ మేరకు నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా జాతీయ సలహాదారురాలిగా సీనియర్ న్యాయవాది గాజుల పద్మజకు నియామక పత్రం అందించినట్లు చెప్పారు.

ఏఎంసీ ఏసీపీగా నీరజాక్షి బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనంతనగరపాలక సంస్థ ఏసీపీగా నీరజాక్షి బాధ్యతలు స్వీకరించారు. పుత్తూరు మున్సిపాలిటీలో టీపీఓగా ఉన్న నీరజాక్షికి ఏసీపీగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ అనంత నగరపాలక సంస్థకు బదిలీ చేశారు. దీంతో శనివారం ఆమె ఏఎంసీలో కమిషనర్ బాలస్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్‌చార్జి ఏసీపీ శిరీష నుంచి బాధ్యతలు తీసుకున్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన ఎంపీడీఓలు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎంపీడీఓల అసోసియేషన్ నాయకులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మను క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపికైన అసోసియేషన్ వివరాలను చైర్‌పర్సన్‌కు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు, ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్, గుత్తి ఎంపీడీఓ ప్రభాకర్, ఆత్మకూరు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, అనంతపురం ఎంపీడీఓ దివాకర్, కూడేరు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం అనంతపురం నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వట్లాడుతూ సీనియార్టీ జాబితా ప్రకటించి, పదోన్నతులు కల్పించాలన్నారు. మూడు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేసి, 9 నెలల బకాయిలు చెల్లించాలని కోరారు. నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, శివశంకర్, మంజునాథ్, ఆదినారాయణ, ధనుంజయ, మల్లన్న, ముత్యాలరాజు పాల్గొన్నారు.

'నిబద్ధతతో విధులు నిర్వహించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిబద్ధత, నిజాయతీతో విధులు నిర్వహించినప్పుడే ప్రత్యేక గుర్తింపుతో పాటు సత్ఫలితాలు వస్తాయని ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీటీ ఆడిటోరియంలో శనివారం అనంతపురం, కర్నూలు, కడప ఉమ్మడి జిల్లాల సహకార కేంద్రబ్యాంకు ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు పరిధిలోని నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)ను తగ్గించి, ఆర్థిక లావాదేవీలు పెంచాలన్నారు. బంగారు నగల తాకట్టుపై విరివిగా రుణాలు అందజేయాలన్నారు. సమష్టిగా బ్యాంకు, సొసైటీల అభివృద్ధికి పనిచేయాలని సూచించారు. ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మాట్లాడుతూ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ తమ అనుభవాలు, భవిష్యత్తుకు ఉపయోగపడే అంశాలను వివరించారు.కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి, లక్నో శిక్షకురాలు శిఖా త్రిపాఠి, డీజీఎంలు రాంప్రసాద్, సుఖదేవబాబు, విజయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



పిల్లలు ప్రదర్శిస్తున్న వర్ణమాల బొమ్మలకొలువు

అనంతపురం విద్య, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామ్‌నగర్‌లో గల నారాయణ పాఠశాలలో చిన్నారులు శనివారం ప్రదర్శించిన వర్ణమాల బొమ్మలకొలువు ఆకట్టుకుంది. ఒకటి, రెండు తరగతుల పిల్లలు స్వయంగా ప్రాజెక్టులు తయారు చేసుకొచ్చి పాఠశాలలో ప్రదర్శించారు. అనంతరం టీచర్లు, తల్లిదండ్రుల సమక్షంలో ఆ ప్రాజెక్టు గురించి వివరిస్తూ అందరినీ ఆనందింపజేశారు. కార్యక్రమంలో ఏజీఎం సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ నీలిమ, ఏఓ నయాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధి నిధుల స్వాహాపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

బెళుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులకు మంజూరైన నిధులు స్వాహా చేశారంటూ మండలంలోని ఎర్రగుడి గ్రామ కార్యదర్శి వర్ల శంకర్, సర్పంచ్ ప్రకాష్‌రెడ్డిపై శనివారం ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఇంకుడు గుంతలు తవ్వగా పంచాయతీ ఖాతా కళ్యాణదుర్గం హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాకు రూ. 77 వేలు జమ అయ్యాయి. ఈ నిధులను సర్పంచ్, కార్యదర్శి వాడుకున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు. విచారిస్తామని పోలీసులు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెద్దవడుగూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ డిమాండ్‌చేశారు. శనివారం కిష్టిపాడు గ్రామంలో రైతులు సాగుచేసిన పంటను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు ఓబిరెడ్డి, ఆదినారాయణ, ఆది, రంగారెడ్డి, అల్లాబకాష్, సుబ్బరాయుడు, నారాయణస్వామి, మధు ఉన్నారు.

రిజర్వాయరుకు 2340 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2340 క్యూసెక్కులు ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు వెల్లడించారు. ఔట్‌ఫ్లో 2340 క్యూసెక్కులు వుండగా ప్రస్తుతం 1.708 టీఎంసీల నీటి నిల్వ వుందన్నారు. ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1528 క్యూసెక్కులు వెళుతుందని అధికారులు వెల్లడించారు.

ఆక్రమణల తొలగింపు

కళ్యాణదుర్గం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆ ర్డీటీ ఆసుపత్రి ఎదుట ఆక్రమణలను అధికారులు తొలగించా రు. శనివారం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, డీఎస్పీ రవికుమార్, సీఐ, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి అక్రమంగా వేసుకున్న ఆక్రమణలను తొలగించారు. ఆర్డీటీ ఆసుపత్రి యాజమాన్యం ఆక్రమణలు ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు వాటిని తొలగించారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

గుత్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పత్తిని కొనుగోలు చేసేందుకు భారతీయ పత్తి సంస్థ ద్వారా స్థానిక మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ తెలిపారు. పింజపొడువును బట్టి మద్దతు ధర నిర్ణయించామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవాలన్నారు.

● తాడిపత్రి : నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన రైతులకు భారతీయ పత్తిసంస్థ ద్వారా తాడిపత్రిలో మార్కెట్‌యార్డులో మద్దతుధరకే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని ఏఓ ఆంజనేయులు తెలిపారు. రైతులకు బ్యాంక్‌లోనే డబ్బులు జమచేస్తామని పేర్కొన్నారు.

కుటుంబ వ్యవస్థ బలోపేతం కావాలి

కళ్యాణదుర్గం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ వ్యవస్థ బలోపేతం కావాలని స్థానిక డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు జ్యోత్స్న పేర్కొన్నారు. సప్త శక్తి సంగం కార్యక్రమం సరస్వతి విద్యా మందిరం పాఠశాలలో ప్రధానాచార్యులు కరణం తిరుమలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ.. మహిళలు సమాజం కోసం తమలోని సప్తశక్తులను జాగృతం చేసుకుని ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు జ్యోతి, గీతాలక్ష్మీ, లలిత, వాసుకి, నర్మద, మంజుల, లీలావతి, గీతా, సౌందర్య, భార్గవి, శారద, పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బ్రహ్మసముద్రం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు రెండు గేట్లు ఎత్తి వేదావతి నదిలోనికి నీరు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో భైరవానితిప్ప, గుండిగానిపల్లి, వేపులపర్తి, అజ్జయ్యదొడ్డి, బుడిమేపల్లి, గుడిపల్లి, కన్నేపల్లి, తీటకల్లు, కుర్లగుండ, రుద్రంపల్లి గ్రామప్రజలు అప్రమత్తంగా వుండాలని తహసీల్దార్ సుమతి తెలిపారు. పిల్లలు, వృద్ధులు, పశువులు నదివైపు వెళ్లకుండా చూసుకోవాలన్నారు.

నిందితుల అరెస్ట్

గుంతకల్లు టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు వన్ టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. పట్టణంలోని అల్లీపీరా కాలనీకి చెందిన షేక్ తాయిబ్‌అలీ, గంగానగర్‌కు చెందిన సయ్యద్ హాజీని చోరీ కేసులో అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద రూ.2.50 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

మహిళపై దాడి

తాడిపత్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లికి చెందిన రమాదేవిపై అదే గ్రామానికి చెందిన నాగరత్నతోపాటు మరో వ్యక్తి కలిసి దాడిచేసి గాయపరిచార ని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి

తాడిపత్రి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అందరూ విభిన్న తరహాలో ఆలోచించాలని సర్‌సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ బీవీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సర్‌సీవీ రామన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24న అనంతపురంలో జరిగిన వికసిత్ భారత్ బిల్డథాన్, ఆత్మనిర్భర్ కార్యక్రమంలో కళాశాలకు సంబంధించి నలుగురు వి ద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. వారిలో చాంద్ హఫీజ్ నవాజ్ మంచి విభిన్న తరహాలో ప్రజెంటేషన్ ఇవ్వడం వల్ల మన కళాశాలకు పేరు ప్రఖ్యాతులు వచ్చాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ విద్యార్థిని అభినందించారు. కళాశాల తరఫున స్కాలర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ ఇందాదర్‌రెడ్డి మాట్లాడుతూ.. హఫీజ్‌నవాజ్‌ను స్ఫూర్తి తీసుకొని కొత్త ఆలోచనలతో విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు రామిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాగేందర్, రవికిరణ్ పాల్గొన్నారు.


సెమినార్‌లో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్

శరవేగంగా బీటీపీ కాలువ పనులు

● 114 చెరువులకు నీరందించేందుకు ప్రణాళిక
● మూడు చోట్ల కొనసాగుతున్న పనులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ) కాలువ పనులకు మహర్దశ పట్టనుంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు సాగు, తాగు నీరు అందించేందుకు ఇప్పటికే మూడు చోట్ల పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా వచ్చే రెండేళ్లలో బీటీపీ కాలువ పనులు పూర్తి చేస్తామని అసెంబ్లీలో ప్రకటించడంతో.. నియోజకవర్గం రైతుల్లో ఆశలు చిగురించాయి. బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లి సమీపంలో పనులను పునఃప్రారంభించారు. కుందుర్పి మండలం బ్రాంచ్ కెనాల్, బ్రహ్మసముద్రం మండలం సమీపంలోని వెస్ట్ కోడిపల్లి, కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి నుంచి దుద్దేకుంట ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి ఉషశ్రీచరణ్ ఐదేళ్లు ఎలాంటి పనులు చేపట్టలేదని నియోజకవర్గ రైతులు విమర్శిస్తున్నారు.


బీటీపీ కాలువ పనులు చేస్తున్న దృశ్యం

రూ.968 కోట్లతో పనులు

వైసీపీ ప్రభుత్వం బీటీపీ ప్రాజెక్టు కాలువ పనులను గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వం రాగానే పెండింగ్ పనులపై దృష్టి సారించింది. గుమ్మఘట్ట మండలం భైరవానితిప్ప ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎగువన కర్ణాటక రాష్ట్రం వేదవతిపై నాలుగు చెక్‌డ్యాంలు నిర్మించడంతో ఈ ప్రాజెక్టుకు వరద తగ్గిపోతూ వచ్చింది. జీడిపల్లి నుంచి కృష్ణాజలాలను తరలించాలని గతంలోనే టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2018, అక్టోబరులో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గరుడాపురం వద్ద పనులకు శంకుస్థాపన చేసి రూ.968 కోట్లు కేటాయించారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

50 వేల ఎకరాలకు సాగునీరు

జీడిపల్లి-భైరవానితిప్ప ఎత్తిపోతల పథకంలో 14 లిఫ్టుల ద్వారా 114 చెరువులకు నీరు అందించాలనేది లక్ష్యం. వీటిలో 79 పెద్ద చెరువులు, 36 చిన్న చెరువులు ఉన్నాయి. చెరువులు నింపడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశాలు ఉన్నాయి.

రైతుల కలలను సాకారం చేస్తాం



కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులకు కృష్ణాజలాలతో నింపి, రైతుల కలలను సాకారం చేయడమే నా ప్రధాన లక్ష్యం. భైరవానితిప్ప ప్రాజెక్టు కాలువ పనులను పూర్తి చేసి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలు తీసుకువస్తాం. ఆ దిశగా ఇప్పటికే పనులన్నీ జోరుగా సాగుతున్నాయి. సాగు, తాగు నీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే మూడు చోట్ల కాలువ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు ఇంజనీర్లతో పనులపై పర్యవేక్షిస్తున్నా. రైతుల ఆశలు, ఆశయాలు నెరవేర్చేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నా. త్వరలోనే బీటీపీ కాలువ పనులు పూర్తి చేస్తాం.

- అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

మల్బరీ తోటను పరిశీలించిన అధికారులు


మల్బరీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

కుందుర్పి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటంపల్లి రైతులు సాగుచేసిన మల్బరీ పంటను చీఫ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ఆఫీసర్ లక్ష్మానాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలో 20 రకాల బయోడైవర్సిటీ విత్తనాలను వేయడం వల్ల మల్బరీ ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలను లభిస్తాయని తెలిపారు. బహు పంటల వల్ల కలుపు శాతం తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ నవీన్, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్, డాక్టర్ నరేంద్ర, మాస్టర్ ట్రైనీ శివ, శంకర్ పాల్గొన్నారు.

కారులో మంటలు

తాడిపత్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోకుల్ లాడ్జి సమీపంలో శనివారం రాత్రి ఓ కారులో మంటలు చెలరేగాయి. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీకి చెందిన రమణారెడ్డి ఐదురోజుల కిందట తన కారును అనంతపురంలో సర్వీసింగ్‌కు ఇచ్చాడు. సర్వీసింగ్ పూర్తి కావడంతో శనివారం రమణారెడ్డి స్వయంగా కారు నడుపుకుంటూ తాడిపత్రికి వచ్చాడు. సీబీరోడ్డులోని గోకుల్ లాడ్జి సమీపంలోకి రాగానే కారు ముందు భాగంలో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై నీరు చల్లారు. కానీ కారు డోర్లు లాక్ కావడంతో ఎంతసేపటికి తెరచుకోలేదు. స్థానికులు అతికష్టం మీద డోర్లు ఓపెన్ చేసి రమణారెడ్డిని రక్షించారు. అగ్నిమాపకశాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. పోలీసులు కారును పరిశీలించి కేసు నమోదు చేశారు.

సోలార్ పవర్ హబ్‌గా రాయదుర్గం: విప్ కాలవ


దర్గాహొన్నూరులో సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సోలార్ పవర్ హబ్‌గా రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో శనివారం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి ఆవసరమైన విద్యుత్ ఉత్పత్తితో పాటు ఇతర ప్రాంతాలకు ఇచ్చే స్థాయికి తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు కృషి చేస్తున్నారని అన్నారు. రాయదుర్గం ప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా 7,500 మెగావాట్ల ఉత్పత్తి వీలవుతుందని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషాద్రి శేఖర్, తుంగభద్ర ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కేశవరెడ్డి, ఎంపీడీఓ విజయ భాస్కర్, ఏఈఈ లక్ష్మీరెడ్డి, టీడీపీ నాయకులు బలరాంరెడ్డి, మల్లికార్జున, అప్పరావు, నారాయణస్వామి, కేశప్ప, అనిల్, వన్నూరుస్వామి, మహేంద్ర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

కణేకల్లు : టీడీపీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన సలామ్ అనే టీడీపీ కార్యకర్త హమాలీ పనిచేస్తూ ప్రమాదవశాత్తు బండ మీదపడి గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న ఆయన సలామ్ ఇంటికి వెళ్లి ఓదార్చారు. పార్టీ తరఫున రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించగా, జామియామసీద్ ముతవల్లి ముర్షిద్‌ఖాద్రి అందించిన మరో రూ. 50 వేలతో కలిపి రూ. లక్ష అందించారు. కార్యక్రమంలో నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, షేక్‌ఫక్రుద్దీన్, రమేష్, సుదర్శన్, వన్నారెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే నిరుద్యోగిత దూరం



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కృషితో రాష్ట్రంలో నిరుద్యోగిత దూరం అవుతుందని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని ఎస్‌ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేలాను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుపై నమ్మకంతో గూగుల్ లాంటి సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా 20 సంస్థలు జాబ్‌మేలాకు వచ్చాయని, ఉద్యోగాలు పొందిన 268 మంది విద్యార్థులు నిబద్ధతతో పనిచేసి కెరీర్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజరు ప్రతాపరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశులు, నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, హనుమంతు, ఫజులు పాల్గొన్నారు.

సెల్ చేతికి.. సమస్యలు గాలికి..!


సెల్‌ఫోన్ చూసుకుంటూ కూర్చున్న అధికారులు

వజ్రకరూరు(ఉరవకొండ), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలపై చర్చించాల్సిన మండల సమావేశంలో అధికారులు సెల్‌ఫోన్‌లో నిమగ్నమయ్యారు. అధికారుల తీరును చూస్తే వారు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో తెలిసిపోతోంది. వజ్రకరూరులోని వె లుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ దేవి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభం నుంచి సమస్యలు తమకేవీ మీ పట్టనట్లుగా అధికారులు సెల్‌ఫోన్‌లు చూసుకుంటూ మునిగిపోయారు. కార్యదర్శులంతా బయట కూర్చొని బాతాకానీ చేసుకుంటూ కాలాక్షేపం చేశారు. వైసీపీ మండల కన్వీనర్, ధర్మపురి సర్పంచు సోమశేఖర్‌రెడ్డి వేదికపై కూర్చోవడం చర్చంశనీయంగా మారింది.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గుత్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్థానిక లచ్చానుపల్లి రోడ్డులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి నవీన్(27)అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన నవీన్ సాయంత్రం రైలు బ్రిడ్జి వద్దకు వెళ్లి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మహిళపై అత్యాచారయత్నం

పుట్లూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో మహిళపై అదే గ్రామానికి చెందిన రాజకుళ్లాయప్ప అనే వ్యక్తి అత్యాచారయత్నం చేశాడని శనివారం పోలీసులు తెలిపారు. మహిళ ఇంట్లో పనులు చేసుకుంటుండగా అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారిస్తున్నామని తెలిపారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊరుచింతల గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణీబాబులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి, పెద్దఎత్తున నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు ఏకగ్రీవం

తాడిపత్రి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఎన్నికలకు నామినేషన్లు ఒక్కొక్కటే రావడంతో ఏకగ్రీవంగా డైరెక్టర్లను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఇస్మాయిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 23వతేదిన నామినేషన్లు స్వీకరించామని తెలిపారు. 24న పరిశీలించగా 9మంది డైరెక్టర్లు ఒక్కొక్కటి వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్ల ప్రకటించారు. డైరెక్టర్లుగా రామయ్య, లక్ష్మీప్రసన్న, రఘునాథ్, విశ్వనాథ్, రాంప్రసాద్, ఆదినారాయణ, రాజేష్, ఫైజా అహ్మద్, మధుసూదన్ నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

వైద్యుడి నిర్లక్ష్యంపై ఆందోళన

గుత్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడి నిర్లక్ష్యంపై బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. శనివారం రోడ్డుప్రమాదంలో గాయపడిన హనుమంతు అనే వ్యక్తిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమయానికి వైద్య సేవలు అందించకపోడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. జి.వెంకటాంపల్లికి చెందిన హనుమంతు అనే వ్యక్తి గుత్తిఆర్ఎస్‌నుంచి బైక్‌పై వస్తుండగా కుక్క అడ్డురావడంతో కిందపడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న డాక్టర్ వెంకటరమణ వైద్య సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు.

చెరువులకు కృష్ణాజలాలు విడుదల

బెళుగుప్ప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెళుగుప్ప, శీర్పి చెరువులకు శనివారం కృష్ణా జలాలు విడుదల చేశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా అధికారులు నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారు. శనివారం సాయంత్రం అంకంపల్లి వద్ద పంపుహౌస్ లో టీడీపీ నాయకులు మోటార్లు ఆన్ చేసి గంగపూజలు చేశారు.

● బ్రహ్మసముద్రం: మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగటంతో టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువ వేదావతి హగరికి విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, సుభాష్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మురడి అంజన్నకు ప్రత్యేక పూజలు


తులసీదళాలతో ఆంజనేయస్వామికి అలంకారం

డీ.హీరేహాళ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మురడి శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు రామాంజనేయులు, పవన్‌స్వామి తెల్లవారుజామున పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన, ఇతర అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు.

● బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి విశేషపూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా తొలి శనివారం స్వామికి గంగజలం తెచ్చి అభిషేకించి పూజలు నిర్వహించినట్లు అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు తెలిపారు. అభిషేకం, అలంకారం చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. దేవగిరి క్రాస్‌లో వెలసిన పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దీపాలు వెలగించి, వ్రతాలు ఆచరించారు.